జగనన్న సారథ్యంలోనే అభివృద్ధి

- ఎమ్మెల్యే నంబూరు శంకరరావు
- ధరణికోటలో అవగాహన సదస్సు

అమరావతి: భవిష్యత్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సంక్షేమ పథకాలు పేద ప్రజలకు అందించాలన్నా, అభివృద్ధి కార్యక్రమాలు నిరంతరాయంగా సాగాలన్నా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి వల్లే సాధ్యమని శాసనసభ్యులు నంబూరు శంకరరావు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని ధరణికోట జేబీ గార్డెన్స్‌లో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి అన్న కార్యక్రమంపై మండలస్థాయి అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమానికి మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు భవిరిశెట్టి హనుమంత రావు అధ్యక్షత వహించారు. ఈ సదస్సులో ఎమ్మెల్యే శంకర రావు మాట్లాడుతూ నాలుగున్నరేళ్ల పాలనలో ఎన్నో సంక్షేమ పథకాలు జగనన్న పేదల ఉజ్వల భవిష్యత్ కోసం అమలు చేశారని, నవరత్నాలతో పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్నారన్నారు. ప్రతిపక్షాలు ప్రజలను మభ్యపెట్టి బురద జల్లే ప్రయత్నం చేస్తున్నాయన్నారు. వారి కుట్రలను తిప్పికొట్టాల్సిన బాధ్యత ప్రతీఒక్క కార్యకర్తపై ఉందన్నారు. మండల పార్టీ అధ్యక్షులు, జేసీఎస్ మండల కన్వీనర్లు ప్రతి సచివాలయాన్ని సందర్శించాలన్నారు. నాలుగేళ్ల పాలనలో అందించిన సంక్షేమ పథకాలతో కూడిన బోర్డును ఏర్పాటు చేయాలన్నారు. గ్రామాల్లో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో కలిసి ప్రతి ఇంటికీ వెళ్లి.. జగనన్న పాలనలో జరిగిన మంచిని అందరికీ వివరించాలన్నారు.

ఈ మహోన్నత కార్యక్రమం విజయవంతం చేయడానికి ప్రతి ఒక్క కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని సూచించారు. గడప గడపకు మన ప్రభుత్వం, జగనన్న సురక్ష వంటి కార్యక్రమాలతో ఇప్పటికే చాలా సార్లు ప్రజల్లోకి వెళ్లామన్నారు. ఇప్పుడు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా పేదలకు నాణ్యమైన వైద్యసేవలు అందేలా చేస్తున్నామన్నారు. వీటన్నింటినీ ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత మండల, గ్రామస్థాయి నాయకులపై ఉందన్నారు. అప్పుడే ఆంధ్రప్రదేశ్ ను అభివృద్ధి పథంలో నడిపించడంతో పాటు జరిగిన మంచి ప్రజలకు తెలియజేయగలుగుతామన్నారు. సచివాలయ వ్యవస్థ, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ సెంటర్లు వంటి వాటి ద్వారా పాలన, పౌరసేవలు ఇంటి ముందుకే తెచ్చిన ఘనత జగనన్నదేనన్నారు. ప్రజలకు ఇంత మంచి చేస్తున్న జగనన్నను ఎదుర్కోలేక ప్రతిపక్షాలు పొత్తుల రాజకీయానికి తెరతీశాయన్నారు. ఎంతమంది ఎన్నిరకాలుగా కలసి వచ్చినా, మంచి చేసిన నాయకుడిపై ప్రజల్లో నమ్మకముందని, వారి ఆదరణతో మరోసారి జగనన్న సీఎం అవడం ఖాయమన్నారు. జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేసే మహత్తర బాధ్యతను ప్రతి ఒక్కరూ తీసుకోవాలన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే అన్న అంశాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమం ద్వారా మండల కన్వీనర్లు, జేసీఎస్ మండల కన్వీనర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు ఎలా ప్రచారం చేయాలో వీడియో రూపంలో ప్రదర్శించారు. ఈ సదస్సులో వైఎస్సార్ సీపీ నియోజవర్గ పరిశీలకుడు పైలా సోమి నాయుడు, జీడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ కోట హరిబాబు, క్రోసూరు మార్కెట్ యార్డు చైర్మన్ ఈదా సాంబిరెడ్డి, ఎంపీపీ మేకల హనుమంతరావు, క్రోసూరు మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ వెంపా జ్వాలా లక్ష్మీనరసింహారావు, జెడ్పీ కో-ఆప్షన్ మెంబర్ షేక్ హష్మీ, మండల వైఎస్సార్ సీపీ జేసీఎస్ కన్వీనర్ నాయుడు రాంబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు అళ్ల శ్రీనివాస రెడ్డి, మాదాసు రాంబాబులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.


సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు


రాజుపాలెం మండలం గణపవరంలో రోగి వివరాలు నమోదు చేసుకుంటున్న వైద్యురాలు


లంకెలకూరపాడులో వైద్య సేవలందిస్తున్న వైద్య సిబ్బంది

అనంతవరంలో ఆరోగ్య సురక్ష

అనంతవరం (క్రోసూరు): ప్రజలందరూ జగనన్న ఆరోగ్యసురక్ష వైద్యశిబిరాలను సద్వినియోగపరుచుకుని తమ ఆరోగ్యాలను కాపాడుకోవాలని ఎంపీపీ పి.కోటయ్య సూచించారు. మంగళవారం మండలంలోని అనంతవరం గ్రామంలో జగనన్న ఆరోగ్యసురక్ష వైద్యశిబిరాన్ని ఎంపీపీ, జెడ్పీటీసీ షేక్ జమీలా గఫూర్, గ్రామ సర్పంచ్ పి.రామయ్య పాల్గొని ప్రారంభించారు. ఈసందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలందరికీ ఉచితంగా వైద్యసేవలు అందించాలని, వైద్యం ఇంటి ముంగిటకు తీసుకురావాలన్న లక్ష్యంగా 15 రోజుల పాటు సర్వే చేసి మరీ వైద్యశిబిరాలను నిర్వహించటం జరుగుతుందన్నారు. ప్రతి గ్రామంలో జరిగే వైద్యశిబిరాలను ప్రజల సద్వినియోగపరుచుకోవాలన్నారు. జెడ్పీటీసీ షేక్ జమీలా గఫూర్ మాట్లాడుతూ 60 రకాల రక్త పరీక్షలు ఉచితంగా చేయడమే కాక ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్స చేయాల్సి ఉంటే వెంటనే తగిన ఏర్పాట్లు కూడా వైద్యులు చేస్తారన్నారు. ఈ వైద్యశిబిరం 400 మంది రోగులకు వైద్యపరీక్షలు చేసి ఉచితంగా మందులు అందచేశా రు. ఈ శిబిరంలో డాక్టర్ టి.ప్రవీణ్, డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్లు, డాక్టర్ డి.ఎస్ రమాదేవీ, డాక్టర్ ఎం.సిరిచందన, డాక్టర్ బాల అంకమ్మబాయి, డాక్టర్ సాద్, ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌పీహెచ్‌లు, ఆశ వర్కర్లు, సిబ్బంది, వైఎస్సార్‌సీపీ నాయకులు మండల అధ్యక్షుడు వెలది అప్పారావు, తిప్పిరెడ్డి అప్పిరెడ్డి, పట్టీల శ్రీనివాసరావు, ఎంపీటీసీ వేణుగోపాలరెడ్డి, డాక్టర్ షరీఫ్, సొసైటీ అధ్యక్షుడు అనుముల కోటిరెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ గార్లపాటిదాసు, సయ్యద్ అబ్దుల్ రహీం, మర్రిశ్రీనివాసరెడ్డి , పోతురాజు గురుస్వామి తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యానికి సర్కారు రక్ష

లంకెలకూరపాడు (ముప్పాళ్ల): అందరూ సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలంటూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలకు అనూహ్య స్పందన లభిస్తోంది. శిబిరాలకు మధుమేహం, రక్తపోటు, రక్తహీనత, కీళ్లు, మోకాళ్ళ నొప్పులు, గుండె, కిడ్నీ సంబంధిత వ్యాధి గ్రస్తులు తరలివచ్చారు. మండలంలోని లంకెలకూరపాడు గ్రామంలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్యసురక్ష వైద్య శిబిరంలో 267 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను అందించినట్లు పీహెచ్‌సీ వైద్యులు పీ.రమాదేవి తెలిపారు. 42 మందికి ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రులకు సిఫార్సు చేశారు. 123 మందికి కీళ్ళు, మోకాళ్ళు సంబంధిత వ్యాధులకు, 120 మందికి కంటి పరీక్షలు చేయగా, వాటిల్లో 17 మందికి కంటి శస్త్ర చికిత్సలు కోసం రిఫర్ చేశారు. వీటితో పాటుగా బీపీ, షుగర్ పరీక్షలు చేయించుకున్నారు. డిప్యూటీ తహసీల్దార్ సీహెచ్ లక్ష్మీప్రసాదు, సర్పంచ్ ఎమ్.వెంకటరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎం.జె.ఎం. రామలింగారెడ్డి, సచివాలయ జేసీఎస్ కన్వీనర్ రెండెద్దుల వెంకటేశ్వర రెడ్డి, ప్రభాకరరెడ్డి, కిక్కురు రామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నక్కా శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు. శిబిరంలో వైద్యులు ఫరూక్‌పర్వేజ్, శామ్యూల్‌పాల్, ప్రసన్నకుమార్, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొని వైద్య సేవలందించారు.

ఆరోగ్యంగా ఉండాలన్నదే ధ్యేయం

అచ్చంపేట: ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలన్న లక్ష్యంతో సీఎం జగన్‌మోహన్ రెడ్డి పాలన కొనసాగిస్తున్నారని మండల స్పెషల్ ఆఫీసర్ ఐ మురళి అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా మండలంలోని చిగురుపాడులోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్పెషల్ అధికారి గ్రామస్తులనుద్దేశించి మాట్లాడారు. ప్రభుత్వం విద్య, వైద్యం కోసం వేలకోట్ల నిధులు కేటాయించిందన్నారు. గ్రామ గ్రామానికి హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేసి, ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని చేపట్టి ఇంటి వద్దకే వైద్యాన్ని అందచేస్తుందన్నారు. ఈ అవకాశాలన్నింటినీ గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రామంలో మొత్తం 263 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రత్యేక వైద్యాధికారులు పాల్గొని సాధారణ వ్యాధులు, జ్వరాలు, దగ్గు, జలుబు, కంటి పరీక్షలు, బీపీ, షుగర్ తదితర పరీక్షలు నిర్వహించి మందులు అందచేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో పి.శివసుబ్రమణ్యం, తహసీల్దార్ సీహెచ్ పద్మాదేవి, మార్కెట్ యార్డు డైరెక్టర్ ఆకుల కోటేశ్వరరావు, పీహెచ్‌సీ వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్స్ పాల్గొన్నారు.


చిగురుపాడులో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

నేడు కోగంటివారిపాలెంలో..
మండలంలోని కోగంటివారిపాలెంలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఏర్పాటుచేసి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేస్తారని ఎంపీడీవో పి.శివ సుబ్రమణ్యం తెలిపారు.

బెల్లంకొండలో 322 మందికి పరీక్షలు

బెల్లంకొండ: గ్రామాలలో ప్రతీ ఒక్కరికీ వైద్య సేవలు అందించడమే ప్రభుత్వం ధ్యేయమని ఎంపీడీవో బి.వెంకటరెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని మన్నెసుల్తాన్‌పాలెం గ్రామంలో 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శిబిరంలో 322 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేసినట్లు స్థానిక పీహెచ్‌సీ వైద్యులు కోటేశ్వరరావు పేర్కొన్నారు. జనరల్ విభాగంలో 165 మందికి, కంటి వైద్య సేవలు 75, గర్భిణులు 21, ప్రసూతి వైద్య సేవలు 21 మందికి వైద్య సేవలు అందించామన్నారు. ఐసీడీఎస్ సిబ్బంది పౌష్టికాహారం స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. ఈ వైద్య శిబిరంలో జనరల్ సర్జన్ వైద్యులు రాజేష్, స్త్రీ ప్రసూతి వైద్యులు అనీలారెడ్డి, జనరల్ ఫిజీషియన్ డా.సాయికృష్ణ, వైద్య సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దారం వెంకట నరసమ్మ, రమణారెడ్డి, సూపర్‌వైజర్లు భాషా, పీహెచ్‌సీ సిబ్బంది, ఎఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆషా కార్యకర్తలు, పంచాయితీ సిబ్బంది పాల్గొన్నారు.


మన్నెసుల్తాన్‌పాలెంలో వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

గణపవరంలో..
రాజుపాలెం: మండలంలోని గణపవరం గ్రామ సచివాలయం-1 పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష మెగా వైద్య శిబిరం మంగళవారం నిర్వహించారు. స్పెషలిస్టు డాక్టర్లు ప్రవీణ్‌కుమార్, సుష్మలు 209 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందించారు. 97 మందికి బీపీ, 95 మందికి షుగర్ పరీక్షలను నిర్వహించి మందులను అందించారు. జర్వం వచ్చిన వారికి రక్త పరీక్షలు నిర్వహించగా ఒకరికి డెంగ్యూ పాజిటివ్ అని తేలడంతో గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు రిఫర్ చేశారు. పీహెచ్‌సీ వైద్యాధికారులు కృష్ణకుమార్, కిషోర్‌లు కూడా వైద్య సేవలు అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈవో మల్లికార్జునశర్మ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రత్యేక వైద్యాధికారులను తీసుకొచ్చి గ్రామాలలో ఆరోగ్య సేవలు అందజేయడం చెప్పుకోదగ్గ విషయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఏరాష్ట్రంలో జరగడం లేదని మన రాష్ట్రంలోనే సీఎం ప్రవేశ పెట్టారని తెలిపారు. ఈ వైద్య సేవలను ప్రతీ ఒక్కరు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు ఉషా రాణి, 40 మంది ఆరోగ్య సిబ్బంది, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


గణపవరంలో శిబిరానికి వచ్చిన వారి వివరాలు నమోదు చేస్తున్న వైద్య సిబ్బంది

క్లుప్తంగా

చామర్రులో అష్టద్రవ్య మహాగణపతి హోమం



అచ్చంపేట: సంకటహర చతుర్థి సందర్భంగా ప్రజల కష్టాలుతీరి సుఖశాంతులతో సుభీక్షంగా ఉండాలన్న కాంక్షతో మండలంలోని చామర్రు కృష్ణానది తీరంలో స్వయంభుగా వెలసిన శ్రీ వరసిద్ధివినాయకుని దేవాలయంలో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు దంపతులు మంగళవారం రాత్రి అష్ట ద్రవ్య మహాగణపతి హోమం జరిపించారు. వేదపండితుల వేదమంత్రోచ్చారణ మధ్య నిర్వహించిన హోమం రెండు గంటలపాటు ఏకధాటిగా కొనసాగింది. చామర్రు రూరల్ డవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షులు ఉప్పల శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో నిర్విఘ్నంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం జరిగిన అన్నదాన కార్యక్రమంలో ఎమ్మెల్యే దంపతులతోపాటు వేలాదిగా తరలి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

నేడు అబ్బూరులో గడప గడపకు మన ప్రభుత్వం

సత్తెనపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గడపగడపకు మన ప్రభుత్వం సత్తెనపల్లి మండలం అబ్బూరు గ్రామంలో బుధవారం సాయంత్రం 4 గంటలకు జరుగుతుందని వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు రాయపాటి పురుషోత్తమరావు మంగళవారం తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు హాజరవుతారన్నారు.

నేడు గుడిపూడిలో సురక్ష వైద్య శిబిరం

సత్తెనపల్లి: రాష్ట్ర ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం సత్తెనపల్లి మండలం గుడిపూడి గ్రామంలో బుధవారం జరుగుతుందని ఎంపీడీవో జీవీ సత్య నారాయణ మంగళవారం తెలిపారు. ఈ వైద్య శిబిరంలో వివిధ రకాల పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేస్తారన్నారు. స్థానిక వైద్యులతో పాటు ప్రత్యేక నిపుణులైన వైద్యులు హాజరై పరీక్షలు చేస్తారన్నారు. అంతేకాక కంటి వెలుగులో భాగంగా నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించి అర్హులైన వారికి కళ్లజోళ్లు పంపిణీ చేసేందుకు సిఫార్సు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాన్ని గ్రామ ప్రజలు వినియోగించుకోవాలని ఆయన కోరారు.

పారదర్శకంగా ఓటరు జాబితా తయారీ

సత్తెనపల్లి: ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పారదర్శకంగా ఓటర్ జాబితా తయారు చేయడం జరుగుతుందని సత్తెనపల్లి ఆర్డీవో బీఎల్ఎన్ రాజకుమారి చెప్పారు. ఎన్నికల కమిషన్, పల్నాడు జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ ఆదేశాల మేరకు మంగళవారం పట్టణంలోని తన కార్యాలయంలో నియోజకవర్గంలోని ఏఈఆర్వోలు, గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఎస్ఎస్ఆర్-2024లో భాగంగా ప్రీ రివిజన్ యాక్టివిటీస్, డెత్, డూప్లికేట్, షిఫ్టెడ్ ఓటర్ల తొలగింపు, పోలింగ్ స్టేషన్ల రేషనలైజేషన్‌పై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సలహాలు, సూచనలు స్వీకరించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి, సత్తెనపల్లి తహసీల్దార్ ఎస్.సురేష్, ఏఈఆర్వోలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రశ్నించే వారిపై దాడులు అప్రజాస్వామ్యం

సత్తెనపల్లి: దేశంలో ప్రధానమంత్రి మోదీ ఆధ్వర్యంలో అరాచక పాలన సాగుతుందని దీనిని ప్రశ్నించిన వారిపై దాడులు, అక్రమ కేసులు పెట్టడం దుర్మార్గమని సీఐటీయూ పల్నాడు జిల్లా ఉపాధ్యక్షులు గుంటూరు విజయకుమార్ అన్నారు. మంగళవారం బ్లాక్ డే సందర్భంగా పట్టణంలోని అన్ని ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ, స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద సభ కార్యక్రమం జరిగింది. ఈ సభా కార్యక్రమానికి డీవైఎఫ్ఐ నాయకులు పెండ్యాల మహేష్ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు డి.విమల, జి.రజిని, జి.మల్లేశ్వరి, అవ్వారు ప్రసాదరావు, ఎ.వీర బ్రహ్మం, జి.బాలకృష్ణ, కె.శివదుర్గారావు, పి.సూర్య ప్రకాశరావు, షేక్ సాయిబా, షేక్ సైదులు, ఎం.వెంకట నారాయణ, జడ రాజ్ కుమార్, పి.ప్రభాకర్, జి.సుసులోన్, ఎ.ప్రసాదరావు, ఆర్ పురుషోత్తం , ఎం.హరిపోతురాజు పాల్గొన్నారు.

రొంపిచర్ల మండలంలో భారీ వర్షాలు

రొంపిచర్ల: మండలంలోని అన్ని గ్రామాల్లో సోమవారం రాత్రి భారీ వర్షం కురిసింది. మండల కేంద్రమైన రొంపిచర్లలో మంగళవారం ఉదయానికి 22.8 ఎం.ఎం. వర్షపాతం నమోదు అయినట్లు తహసీల్దార్ కార్యాలయ అధికారులు తెలిపారు. కొన్ని గ్రామాల్లో ఓ మోస్తరు వర్షాలు కురియగా, విప్పర్ల, రెడ్డిపాలెం, కొత్తపల్లి తదితర గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. రైతులు దుక్కులు దున్నిన పొలాల్లో వర్షం నీరు నిలబడింది. మంగళవారం కూడా ఆకాశం మేఘావృతమై అప్పుడప్పుడు చిరుజల్లులు పడుతూ ఉన్నాయి. వర్షం కారణంగా వ్యవసాయ పనులు నిలిచిపోయాయి. వాగులు, వంకలు నీటి ప్రవాహం ప్రారంభమైంది.

రాయితీలు పొందాలంటే పంటనమోదు తప్పనిసరి

జిల్లా వ్యవసాయాధికారి ఐ.మురళి

అచ్చంపేట: రైతులంతా తమ పంటలను ఈ క్రాప్ చేయించుకోవాలని, అలా చేయించుకున్న వారికే ప్రభుత్వ రాయితీలు వర్తిస్తాయని జిల్లా వ్యవసాయాధికారి ఐ.మురళి అన్నారు. మండలంలోని కోనూరు రైతుభరోసా కేంద్రంలో మంగళవారం ఆయన వ్యవసాయ సిబ్బంది చేసే పంట నమోదులు, ఈకేవైసీలను పరిశీలించారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అచ్చంపేట మండలంలో 21 వేల ఎకరాలలో పంట సాగు చేస్తున్నారన్నారు. ఈరోజు వరకు కేవలం 15 వేల ఎకరాలను మాత్ర మే పంట నమెదు చేయడం జరిగిందన్నారు. ఈకేవైసీ 3 వేల ఎకరాలు మాత్రమే చేసినట్లు చెప్పారు. పంట నమోదు చేసుకున్న ప్రతి ఒక్కరూ ఈకేవైసీ కూడా చేయించుకుంటేనే ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలు వర్తిస్తాయని చెప్పారు. మరో రెండు మూడు రోజులలో గడువు ముగియనుందని రైతులంతా త్వరపడాలని ఆయన కోరారు. అనంతరం ఆయన రైతుభరోసా కేంద్రం ద్వారా ఇచ్చే ఎరువులను పరిశీలించారు. ఆయన వెంట ఏవో వెంకటేశ్వర్లు, వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.


పంట నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి ఐ.మురళి

ఫెలోషిప్ నూతన అధ్యక్షుడిగా ఫినేహాస్

అమరావతి: మండల పరిధిలోని వైకుంఠపురం నజరైతు ప్రార్థనా మందిరంలో మంగళవారం మండల ఎనాయింటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ సర్వసభ్యసమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మండల ఎనాయింటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కార్య వర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నిక చేశారు. ఈసందర్భంగా సంస్థ నూతన అధ్యక్షుడు ఫినేహాస్ మాట్లాడు తూ తొమ్మిది మందితో కూడిన నూతన కార్యవర్గంలో గౌరవ అధ్యక్షుడు గా వందనం, అధ్యక్షుడిగా నండూరి ఫినేహాస్, ఉపాధ్యక్షుడిగా పచ్చల హనోక్, కార్యదర్శిగా నండూరు కోటేశ్వర రావు, సంయుక్త కార్యదర్శి బొక్కా కిరణ్, కోశాధికారిగా మేకల శరత్ బాబు, కమిటీ సభ్యులుగా యోహాను, ఏలియా, డేవిడ్, గిద్యోనులను ఏకగ్రీవంగా ఎన్నిక చేయడం జరిగింది. ఈ ఫెలోషిప్ ద్వారా ఆధ్యాత్మిక, సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలియచేశారు.


ఎనాయింటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కార్యవర్గం

స్కూల్ పోటీలకు యడ్లపాడు విద్యార్థులు

యడ్లపాడు: త్వరలో జిల్లాస్థాయిలో జరిగే వివిధ క్రీడా పోటీలకు యడ్లపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు 8 మంది ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం జి.విజయభారతి తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు మంగళవారం పాఠశాల ఆవరణలో అభినందన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్‌లో భాగంగా ఈనెల 29వ తేదీన నాదెండ్ల మండలం సాతులూరు జెడ్పీహైస్కూల్లో నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన కబడ్డీ, ఖో-ఖో, త్రోబాల్, వాలీబాల్ క్రీడల్లో తమ పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభను ప్రదర్శించారని తెలిపారు. ఆయా పోటీల్లో నైపుణ్యాన్ని ప్రదర్శించిన విద్యార్థులు అండర్ -14 కబడ్డీ బాలికల విభాగంలో పఠాన్ నాస్మిన్, బాలుర విభాగంలో జి ధర్మతేజ, అండర్ -17లో కబడ్డీలో ఆర్ కిషోర్, అండర్ -14 త్రోబాల్ బాలికల్లో ఎం సమీర, అండర్-17 త్రోబాల్ పి రూపాంజలి, అండర్ -17 వాలీబాల్‌లో యు.అభిలాష్, అండర్-14 ఖో-ఖోలో జి తులసీరాం, అండర్ -17 వాలీబాల్ జి సాగర్‌బాబు జిల్లాస్థాయి క్రీడాపోటీలకు ఎంపికైనట్లు వెల్లడించారు. అనంతరం విద్యార్థులతో పాటు వారికి మంచి తర్ఫీదునిచ్చిన పాఠశాల పీఈటీ షేక్ ఆషీతున్‌ను సత్కరించారు. జిల్లాస్థాయిలోనూ క్రీడా సత్తాను చూపించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. అభినందించిన వారిలో పంచాయతీ ఎంపీపీ పి.ఝాన్సీ, సర్పంచ్ కె.హేమ, ఎంఈవో 1,2 నాగరత్నం, అరుణకుమారి, పీఎం చైర్మన్ కె.వేణు బాబు ఉపాధ్యాయులు ఉన్నారు.


ఎంపికైన క్రీడాకారులతో హెచ్ఎం విజయభారతి, పీఈటీ షేక్ ఆషీతున్

ఫాస్టర్స్ ఫెలోషిప్‌కు విరాళం



అమరావతి: మండలంలోని ఫాస్టర్స్ సంక్షేమం కోసం గత 15సంవత్సరాలుగా పనిచేస్తున్న జీసస్ ఫాలోవర్స్ అమరావతి ఫాస్టర్స్ ఫెలోషిప్‌కు మన్నా మినిస్ట్రీస్ ఫాస్టర్ గుడిశె ప్రభుదాసు మంగళవారం 50 వేల రూపాయలు విరాళం అందచేశారు. మంగళవారం స్థానిక హౌస్ ఆఫ్ ప్రేయర్ ప్రార్థనా మందిరంలో ఫాస్టర్ శామ్యూల్ అధ్యక్షతన నిర్వహించిన మండల ఫాస్టర్ల సమావేశంలో ఈ విరాళాన్ని అందచేశారు. అలాగే ఈ సమావేశంలోనే 19 వేల రూపాయలను ఐదుగురు ఫాస్టర్లకు ఆర్థిక సాయం కింద ఫాస్టర్స్ ఫెలోషిప్ సభ్యులు అందచేయటం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల ఫాస్టర్ల సంఘ కార్యవర్గ సభ్యులు ఆశోక్ కుమార్, ప్రకాష్, ప్రకాశరావు, పీటర్ పాల్, విజయకుమార్, బాబురావు, డేవిడ్ పాల్గొన్నారు.

నేడు అచ్చంపేటలో అవగాహన సదస్సు

అచ్చంపేట: ఆంధ్రప్రదేశ్‌కు జగనన్నే ఎందుకు కావాలంటే కార్యక్రమంపై స్థానిక సాయిబాబా కల్యాణ మండపంలో బుధవారం ఉదయం 10.30 గంటలకు మండల స్థాయి అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చిల్కా చంద్రయ్య తెలిపారు. ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయాల కన్వీనర్లు పాల్గొనవలసినదిగా ఆయన కోరారు.

సీనియర్ సిటిజన్స్ పరిరక్షణకు ప్రత్యేక చట్టాలు

సత్తెనపల్లి: సీనియర్ సిటిజన్స్ (వృద్ధులకు) పరిరక్షణకు వారి మనుగడ కోసం చట్టంలో ప్రత్యేక సెక్షన్లు ఏర్పాటు చేశారని న్యాయవ్యవస్థ పూర్తి భరోసా కల్పిస్తోందని ప్యానల్ న్యాయవాది దివ్వెల శ్రీనివాసరావు అన్నారు. రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు సత్తెనపల్లి మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, సత్తెనపల్లి సీనియర్ సివిల్ జడ్జి డి.నాగ వెంకటలక్ష్మీ సూచనల మేరకు అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం సందర్భంగా పట్టణంలోని మాతృ శ్రీ మొల్లమాంబ అనాథ వృద్ధుల ఆశ్రమంలో మంగళవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా వృద్ధుల మనుగడ కోసం ఉన్న అనేక చట్టాలను వివరించారు. అనంతరం అక్కడ ఉన్న ఒక్కొక్క వృద్ధుడిని గురించి వారికి ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అంతేకాకుండా వారికి అవసరమైన సలహాలను, సూచనలను అందించారు. మండల న్యాయ సేవాధి కార సంస్థ తరుపున ఉచిత న్యాయ సేవలను అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పారా లీగల్ వాలంటీర్ కె.విజయ గోపాల్, తదితరులు ఉన్నారు.


వృద్ధులనుద్దేశించి మాట్లాడుతున్న న్యాయవాది శ్రీనివాస రావు

నిందితులను కఠినంగా శిక్షించాలి

నకరికల్లు: లఖింపూర్ ఘటనలో రైతులను కారుతో తొక్కించి దారుణ ఘాతుకానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని రైతు కార్మిక సంఘం నాయకులు అనుముల లక్ష్మీశ్వర రెడ్డి డిమాండ్ చేశారు. లఖింపూర్ ఘటన జరిగి ఏడాది పూర్తి కావడంతో రైతుసంఘాలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం బ్లాక్ డే పాటిస్తూ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రం ప్రవేశపెట్టిన రైతు నల్లచట్టాలకు వ్యతిరేకంగా నిరసన తెలుపుతున్న రైతులను గతేడాది బీజేపీ ఎంపీ కుమారుడు తన కారుతో తొక్కించి హత్యకు ఒడిగట్టాడన్నారు.
సాక్ష్యాలున్నా నిందితులను శిక్షించకపోవడం దారుణమన్నారు. తక్షణమే నిందితులను శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీడీఎం జిల్లా అధ్యక్షుడు షేక్.మస్తాన్ వలి, గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.కోటానాయక్, ఎంసీపీఐయూ జిల్లా మహిళా అధ్యక్షురాలు గాదె కుమారి, మాల మహానాడు సోషల్ మీడియా ఇన్‌చార్జి గోదా బాల, జి.పిచ్చారావు, గోదా చిన్ని, లాలూ, గుంజా ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.


అబ్దుల్ కలాం సెంటర్‌లో నిరసన తెలుపుతున్న రైతుసంఘాలు, ప్రజాసంఘాల నాయకులు

పశువుల మేత కోసం వెళ్లి విద్యుదాఘాతంతో మృతి

బెల్లంకొండ: పొలంలో ప్రమాదవశాత్తూ విద్యుత్ షాక్ కొట్టి వ్యక్తి మృతిచెందిన ఘటన మంగళవారం వెలుగు చూసింది. స్థానిక ఎస్ఐ కె.అమీర్ తెలిపిన వివరాల ప్రకారం మృతుడు మండల కేంద్రమైన బెల్లంకొండకు చెందిన తాటికొండ శ్రీను (26) అని పేర్కొన్నారు. రోజు మాదిరిగా సోమవారం సాయంత్రం శ్రీను పశువుల మేత కోసం పొలానికి వెళ్లాడు. కాగా విద్యుత్ సబ్ స్టేషన్ సమీపంలో ఉన్న పొలాలలో ట్రాన్స్‌ఫార్మర్ నుంచి ఒక రైతు మరో పొలంలో ఉన్న బోరుకు విద్యుత్ సరఫరా ఏర్పాటు చేసుకున్నాడు. కాగా గడ్డి కోయడానికి వెళ్లిన శ్రీను ప్రమాదవశాత్తూ విద్యుత్ తీగలు తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. గడ్డి కోయడానికి వెళ్లిన శ్రీను రాత్రి 10 గంటలు అయినా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పొలాలకు వెళ్లి వెతకడంతో విగతజీవిగా పడి ఉన్నాడు. మృతి చెందిన శ్రీనును చూసి కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. సమాచారం అందుకున్న ఎస్ఐ ఘటనా స్థలానికి వచ్చి వివరాలను సేకరించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.


మృతి చెందిన శ్రీను